==================================================================
**Language in India** www.languageinindia.com **ISSN 1930-2940 Vol. 18:8 August 2018**
**India's Higher Education Authority UGC Approved List of Journals Serial Number 49042**
==================================================================

# An Analysis of *Kathatmaka Satakam* Based on *Maruti Satakamu*

**Ms. Harita Bhatlapenumurthy, Ph.D. Research Scholar**

==================================================================

**Abstract**

This paper in Telugu aims to analyze K*athatmaka Satakam* as a special genre in Telugu literature. The analysis is done based on *Maruti Satakam* – a Kathatmaka Satakam written by a 19th century poet by name, Gopinatha Venkata Kavi.

In the first section, the changes in the Sataka literature in 19th century in terms of the variety in the subject chosen and in terms of volume of works written were discussed in brief. In the second section, *Maruti Satakam* was introduced; its content and the meter in which the poems were written were touched upon.

In the third section, the arguments that place *Maruti Satakam* under a *Khanda Kavya* were refuted and it was identified as a *Kathatmaka Sataka*m. In the last section, the genre of *Kathatmaka Sataka*m was analyzed based on *Maruti Satakam* and the reasons why it couldn't flourish as a separate genre in Telugu literature were identified.

# కథాత్మక శతకం – విశ్లేషణ – మారుతి శతకము ఆధారంగా

## kathātmaka śatakaṁ – viślēṣaṇa – māruti śatakamu ādhāraṅgā

**Ms.Harita Bhatlapenumurthy, Ph.D. Research Scholar**
harita256@gmail.com
Department of Telugu, University of Hyderabad, Hyderabad

**సంక్షిప్తి:**

ఈ పత్రం మారుతి శతకం ఆధారంగా కథాత్మక శతకం అనే మిశ్ర ప్రక్రియను విశ్లేషిస్తుంది.

మొదటి విభాగంలో 19వ శతాబ్దంలో తెలుగు సాహిత్యం సాధించిన నవ్యతను గూర్చి, ఈ నవ్యత శతక సాహిత్యంలోనూ ప్రవేశించి, శతక వస్తువులో తెచ్చిన మార్పులను గూర్చి, కావ్య కథ శతకంలోకి చేరి కథాత్మక శతకంగా మారిన వైనాన్ని గూర్చి సంగ్రహంగా స్పృశించడం జరిగింది.

రెండవ విభాగంలో మారుతి శతకాన్ని పరిచయం చేసి, మూడవ విభాగంలో మారుతి శతకాన్ని ఖండ కావ్యమన్న వాదనలను తిరస్కరించి, కథాత్మక శతకంగా చూపించడమైనది.

నాలుగవ విభాగంలో కథాత్మక శతకాన్ని మారుతి శతకం ఆధారంగా విశ్లేషించి, కథాత్మక శతకం ఒక ప్రక్రియగా స్థిరపడకపోవడానికి గల కారణాలను విశదీకరించే ప్రయత్నం చేయడం జరిగింది.

## 1. పరిచయం

తెలుగు సాహిత్యంలో 19వ శతాబ్దికి విశిష్టమైన స్థానముంది. తెలుగు సాహిత్యాన్ని సంప్రదాయ పద్ధతులనుండి మళ్ళించి కొంతపుంతలు తొక్కించిన ఘనత ఈ శతాబ్దిదే. ప్రక్రియా వైవిధ్యం రీత్యా కూడా ఈ శతాబ్ది విలక్షణమైనది. ఒకవైపు అనూచానంగా వస్తున్న సంప్రదాయ సాహిత్యం, మరొకవైపు

ఆంగ్ల విద్యా ప్రభావంతో తెలుగులో అడుగుబెడుతున్న నూతన ప్రక్రియలు 19వ శతాబ్దపు తెలుగు సాహిత్యాన్ని పరిపుష్టం చేశాయి. ఈ యుగంలో వచ్చినన్ని సాహిత్య ప్రక్రియలు, వైవిధ్యభరితమైన రచనలు మరే యుగంలోనూ రాలేదు. ఈ యుగంలో పాశ్చాత్య సాహిత్య పరిచయంవలన తెలుగులో మొదలైన నవ్య ప్రక్రియలతో పాటుగా, సంప్రదాయ సాహిత్యంలో కూడా కొన్ని నవ్య రచనలు, నవ స్ఫూర్తితో వచ్చిన రచనలు ఉన్నాయి. ఈ యుగంలో వచ్చిన నవ్య ప్రక్రియలలో ఒకటైన కథాత్మక శతకం గురించి ఈ పత్రంలో చర్చించబోతున్నాను.

శతక సాహిత్యానికి 19వ శతాబ్ది స్వర్ణయుగం. రాశిలో అయితే శతక సాహిత్యంలో సింహభాగం ఈ శతాబ్దిలో వెలువడ్డదే. వైవిధ్యం విషయంలో కూడా ఈ శతాబ్దిలో శతక సాహిత్యం అపూర్వమైన దారుల్లో పయనించింది. అంతవరకు ఎక్కువగా భక్తి, నీతి సంబంధిత శతకాలు మాత్రమే కానవచ్చాయి. 19వ శతాబ్ది శతక సాహిత్యానికి విస్తృతిని ప్రసాదించింది. ఈ కాలంలో శతకం కవుల ప్రయోగాలకు వేదికగా నిలిచింది. వస్తువు ఏదైనా శతకంలో ఇట్టే ఇమడసాగింది. తిట్టు శతకం, జీవిత కథాత్మక శతకం, అధిక్షేప శతకం, రాజ కీర్తన – దూషణ శతకం, అనువాద శతకం, సమస్యా పూరణాత్మక శతకం, జీవిత కథా శతకం, కథాత్మక శతకం, చమత్కార(హాస్య) శతకం ఇలా ఎన్నో వస్తువులను తన శరీరంలో ఒదిగించుకుంది శతక ప్రక్రియ. ఇది 18వ శతాబ్దిలో మొదలై 19వ శతాబ్దిలో విస్తరించిన పరిణామం.  ఈ క్రమంలో కావ్య వస్తువు కూడా 19వ శతాబ్దిలో శతకంలోకి ప్రవేశించి, కథా శతకం లేక కథాత్మక శతకం అనే కొత్త ప్రక్రియ రూపుదిద్దుకుంది.

ప్రసన్న రాఘవ శతకం – వంగూరి ముద్దు నరసకవి, ముకుంద రాఘవ శతకం – జూలూరి లక్ష్మణ కవి, లవకుమార శతకం – వద్ది తాతయ్య కవి, రామాయణ సంగ్రహ శతకం – మంగిపూడి వీరయ సిద్ధాంతి మొదలైనవి కథాత్మక శతకాల కోవలోకి వస్తాయి. అలాగే ఆత్మకథా రూపంలో వెలువడిన శతకాలు – హరిహరేశ్వర శతకం – మండపాక పార్వతీశ్వర శాస్త్రి,  బిల్వేశ్వర శతకం – కొక్కొండ వెంకటరత్నం పంతులు కూడా ఉన్నాయి

ఈ పత్రం గోపినాథ వేంకటకవి రాసిన మారుతి శతకాన్ని అనుసరించి కథాత్మక శతక ప్రక్రియను విశ్లేషించే ప్రయత్నం చేస్తుంది.

## 2. మారుతి శతకము

మారుతి శతకకర్త గోపినాథ వేంకటకవి నెల్లూరు జిల్లా కావలి తాలూకా లక్ష్మీపురం గ్రామంలో 1813లో జన్మించాడు. వేంకటకవి తొలి రచన మారుతి శతకం. ఆంజనేయుని జీవితచరిత్రను శార్దూల, మత్తేభ వృత్తాలలో కథాత్మక శతకంగా మలచాడు కవి. వాల్మీకి రామాయణాన్ని అనుసరించి, “మారుతీ” అన్న మకుటంతో 116 పద్యాలలో శతకంగా రచించాడు. ఈ కథాత్మక శతకంలో వస్తువు హనుమంతుడి జీవితం. తదనుగుణంగా, ఆంజనేయుడి పుట్టుక, బాల్యం, విద్యాభ్యాసం, రామసుగ్రీవులకు మైత్రిని కుదర్చడం, సీతాన్వేషణం, రాక్షసులను భంజించడం, లంకా దహనం, చివరకు రామరావణ యుద్ధంలో కీలక పాత్ర వహించడం వంటి ఘట్టాలనన్నిటినీ క్రమ పద్ధతిలో ఈ శతకంలో వర్ణించాడు కవి. చాలావరకు వాల్మీకి రామాయణాన్ని అనుసరించినా, కొన్ని చోట్ల హనుమంతుడి పరాక్రమాన్ని వర్ణించే అమూలక అంశాలైన మైరావణ వృత్తాంతం, కాలనేమి వృత్తాంతం మొదలైన వాటిని కూడా ప్రస్తావించాడు వేంకటకవి.

మారుతి శతకంలోని 116 పద్యాలలో 35 శార్దూలవిక్రీడితాలు, 81 మత్తేభవిక్రీడితాలు ఉన్నాయి. శతకంలో మొదటి పద్యం కావ్య సంప్రదాయమనుసరించి దైవ, గురు, పూర్వకవి నమస్కారాలతో ప్రారంభం కాగా, చివరి రెండు పద్యాలు కవి ఆత్మాశ్రయాలైన వంశనామాది వర్ణన పద్యాలు. మిగిలిన 113 పద్యాలలో 100 పద్యాలు కథా సంబంధులు కాగా, శతకాంతంలో నిబంధించిన మిగిలిన పద్యాలు మాత్రం హనుమంతుడిని కీర్తిస్తూ రచించిన సంప్రదాయకమైన శతక పద్యాలు.

## 3. ప్రక్రియా వివేచన

గోపినాథ వేంకటకవి మారుతి శతకం పైచూపుకు శతకమే అయినా ఇది ఇతర శతకాల వంటిది కాదు. ఇదొక విలక్షణమైన శతకం. కథను తనలో ఇముడ్చుకున్న కథాపరమైన శతకం.

శతక లక్షణాలను విశ్లేషిస్తూ, ఆచార్య జి.వి.ఎస్.గారు,

“శతకానికి మకుటం ప్రాణం. సంఖ్యా నియమం, వృత్త నియమం, భాషా నియమం అనేవి శతక ప్రక్రియకు బాహ్య నిర్మాణ లక్షణాలు. ఆత్మాశ్రయ స్వభావం, రసనియమం శతకానికి అంతర్నిర్మాణ లక్షణాలు” అని తెలిపారు (సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు[2005:147]).

“శతకం అల్పకావ్యమే కావొచ్చు. ఉదాత్తకావ్యశ్రేణిలో నిలవగలిగే శక్తి సంపన్నత దానికి లేకపోవచ్చు. కవితాశక్తి విరాట్ స్వరూపం అందులో పరిపూర్ణంగా ప్రదర్శితం కాకనూపోవచ్చు అయితే శతకంలో ఒక విశిష్టత లేకపోలేదు. అది ఆత్మాశ్రయ కవితారూపం. కవి హృదయాని కది కమనీయ దర్పణం” (తెలుగులో పరిశోధన:శతకాలు, ఉదాహరణలు మొదలగు ప్రక్రియలపై పరిశోధన – చల్లా రాధాకృష్ణశర్మ[1983:122]).

పై ఉటంకింపులవలన ఆత్మాశ్రయ కవితాతత్త్వం శతకానికి అత్యంత ప్రధానమైన లక్షణమని చెప్పవచ్చు. ఆత్మాశ్రయ కవిత్వంలో కవి నేరుగా తన అంతరంగాన్ని వ్యక్తపరుస్తాడు. కవిత్వంలో ప్రతిఫలించేది కవి వ్యక్తిగత స్పందనే. మారుతి శతకానికి బాహ్య నిర్మాణ లక్షణాలైన మకుటం, సంఖ్యా నియమం, వృత్త నియమం, భాషా నియమం కుదురుకుంటాయి కాని అంతర్నిర్మాణ లక్షణమైన ఈ ఆత్మాశ్రయ స్వభావం ఉండదు. అలాగే, శతకానికి ఉండవలసిన మరొక ముఖ్య లక్షణం ముక్తకత. “శతకము ముక్తక పద్య సముచ్చయము. స్వయం సంపూర్ణ భావాత్మకము ముక్తకము. ఏ పద్యమున కది స్వతంత్రమైనది. ఒక పద్యమునకు తరువాతి పద్యమునకు అన్య విషయమునందెట్టి సంబంధముండదు” అని శతక సాహిత్యంమీద విస్తృత పరిశోధన చేసిన కె.గోపాలకృష్ణారావుగారు

పేర్కొన్నారు (ఆంధ్ర శతక వాఙ్మయము [1975:34]). కాని మారుతి శతకము క్రమబద్ధంగా పేర్చబడ్డ పద్యాల వరుస. ఇక్కడ కొనసాగింపు కనపడుతుంది. కనుక మారుతి శతకము పైచూపుకు శతకమే అయినా అంతర్తత్త్వం మాత్రం శతకానికి కాదు.

మారుతి శతకం మొదటి ముద్రణ ప్రతికి పీఠికను వ్రాసిన శ్రీరాంభట్ల లక్ష్మీనారాయణశాస్త్రిగారు ఈ రచననొక ఖండకావ్యంగా అభివర్ణించారు. ఈ అభిప్రాయాన్ని విశ్లేషించే ముందు ఖండకావ్యానికి కొన్ని ప్రసిద్ధమైన నిర్వచనాలను గమనిద్దాం.

"కవిత్వం కథనుండి విడివడి, కథతో సంబంధం లేకుండా నిలబడి ఖండకావ్యం అయింది. ఖండకావ్యంలో కథ అనేది బొత్తిగా ఉండదు. ఖండకావ్యం యొక్క విశిష్ట లక్షణం యేమిటంటే, పాఠకునిలో ఒకే ఒక అనుభూతిని కలిగించడం. అది పది పంక్తులున్నా, పది పుటలున్నా ఆ లక్షణం ఉండాలి. ఖండకావ్యం యొక్క ప్రాణప్రదమైన లక్షణం అది. రసం అనే మాట వాడవచ్చుననుకుంటే ఖండకావ్య లక్షణం యేక రసవ్యంజకత్వం – యేకైక రసవ్యంజకత్వం" (కథానికా, దాని శిల్పము- రాచమల్లు రామచంద్రారెడ్డి).

కథా త్యాగం, భాషా సారళ్యం, వర్ణనల సంకోచం, ప్రబోధ ప్రాధాన్యం ఖండకావ్య లక్షణాలని చేకూరి రామారావు గారు పేర్కొన్నారు (రజత రంజని[1988:274]) .

"ఖండకావ్యాల్లో ఒక అనుస్యూతమైన ఇతివృత్తముంటుందని చెప్పటానికి వీలు లేదు, ఒక్కొక్కప్పుడు ఒకటే సన్నివేశముండవచ్చు. మరొకప్పుడు కతిపయ సన్నివేశా లుండవచ్చు. అంతేకాని మొదటినించి కథా పర్యవసానము దాకా కథ జరుగదు." (కురుగంటి సీతారామాచర్యులు – నవ్యాంధ్ర సాహిత్య వీధులు[1994:267])

పై నిర్వచనాల వల్ల ఖండకావ్యంలో కథ గౌణంగా, అనుభూతి (రసం) ప్రధానంగా ఉంటుందని తెలుస్తోంది కనుక హనుమత్కథా ప్రధానమైన మారుతి శతకాన్ని ఖండకావ్యమని నిర్ధరించలేము.

కథా ప్రధానమైనది కనుక ఖండకావ్యం కాదు, ఆత్మాశ్రయ తత్త్వం లేదు, ముక్తక పద్య సముచ్చయం కాదు కనుక శతక ప్రక్రియ కిందకు రాదు. మరి మారుతి శతకం ఏ ప్రక్రియ కిందకు వస్తుంది అని ప్రశ్నించుకుంటే, "తెలుగు కవులు ప్రయోగించిన, ప్రయోగిస్తున్న ప్రక్రియలు శుద్ధమైన ప్రాథమిక ప్రక్రియలు కావు; ప్రౌఢమైన మిశ్ర ప్రక్రియలు" అని డా. జి.వి.ఎస్ అన్నట్టుగా (సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు[2005:ప్రవేశిక]) ఈ మారుతి శతకం ఒక మిశ్ర ప్రక్రియా రూపం.

"శతకము ముక్తక లక్షణము నుండి కథాత్మక శతకములలో ముక్తమైనది. తెలుగు శతక వాఙ్మయము వికాసమునందిది యొక ప్రధానమైన ఘట్టము. కావ్య ధోరణిలో శతకమును రచించుటకు కొందరు కవులొనర్చిన ప్రయత్న ఫలమిది. కాలక్రమమున కావ్యవస్తువు వలె శతక వస్తువు కూడా విస్తృతమైనది. ఇట్టి శతకములను ఐతిహాసిక పౌరాణిక కథాత్మకములు, జీవిత కథాత్మకములు, ఆత్మ కథాత్మకములు అని మూడు ప్రధాన వర్గములలో పరిశీలింపవచ్చును" అని కె.గోపాలకృష్ణారావుగారు (ఆంధ్ర శతక వాఙ్మయము[1975:34]) పేర్కొన్నారు.

పై నిర్వచనాన్ని బట్టి మారుతి శతకాన్ని ఐతిహాసిక కథాత్మక శతకంగా పేర్కొనవచ్చు. అసలు కథాత్మక శతకమన్న మాటే విరోధాభాసకు ఉదాహరణగా చెప్పుకోదగ్గ పదబంధం(an oxymoron). "మకుటాత్మకమగు శత ముక్తక సముచ్చయమే శతకము" (శతక సాహిత్య వికాసము[1976:87]). ముక్తకమైన పద్యాల సముదాయమే శతకమని స్థూలంగా చెప్పుకుంటే, కథ అనేది దానికి పూర్తిగా వ్యతిరేకమైన ప్రక్రియ. కథ అంటే ఒక లక్ష్యం ఉద్దేశంగా వరుసగా పేర్చబడ్డ ఘట్టాల సమాహారం. ఈ విధంగా పరస్పర విరుద్ధ లక్షణాలు కలిగిన ఈ ప్రక్రియను వివేచిద్దాం.

## 4. కథాత్మక శతకం – వివేచన

కోవెల సంపత్కుమారాచార్యగారు ఛందో రహితమైన కవిత్వాన్ని గురించి చెబుతూ, "సహజమైన తన శరీరాన్ని అనవసరంగా పోగొట్టుకొని ఇతర శరీరంలో ప్రవేశించినప్పుడు – అంటే పరకాయ ప్రవేశం చేసినప్పుడు జీవి పడే ఇబ్బంది అంతా ఆ స్థితిలో(ఛందో రహిత స్థితిలో) కవిత్వమూ

అనుభవిస్తుంది. పరకాయ ప్రవేశం చేసినప్పుడు జీవికి సుఖంగానీ, సమగ్రత గానీ లేదు” అని అంటారు (తెలుగు ఛందస్సులో వెలుగులు[2011:110]). సరిగ్గా ఇదే స్థితి మనం కథాత్మక శతకం విషయంలో కూడా చూడవచ్చు.

కథాత్మక శతకంలో కథ తనది కాని శరీరమైన శతకంలో ప్రవేశించి నానా ఇబ్బందులూ పడుతుంది.

1. శతకానికి సంఖ్యా నియమం ఉంటుంది కనుక కథను విస్తారంగా, రస వ్యంజకంగా చెప్పడం కుదరదు. ఎంత పెద్ద కథ అయినా శతకానికి నిర్దేశించుకున్న పద్యాలలోనే చెప్పాల్సి ఉంటుంది. మారుతి శతకంలో హనుమత్కథ మొత్తం 100 పద్యాలలోనే పొందుపరిచారు వేంకటకవి.

2. వృత్త నియమం ఉంటుంది కనుక కథలో సందర్భానుగుణంగా ఛందస్సును ఎంచుకునే వెసులుబాటు ఉండదు. మారుతి శతకం శార్దూల, మత్తేభ వృత్తాలలో చెప్పబడింది. సహజంగా ఈ వృత్తాలు ఓజోగుణ ప్రధానమై వీర, రౌద్ర రసాల ఆవిష్కరణకు అనుకూలంగా ఉంటాయి. హనుమత్కథ వీరరసప్రధానమైనదే అయినా, దయనీయ స్థితిలో సీతను చూడటం, ఆమెతో సంభాషించటం, రామునికి సీత కుశలవార్త తెలపటం వంటి కరుణరసాత్మక ఘట్టాలకు కూడా అవే ఛందస్సును వాడవలసి వచ్చింది.

3. మకుట నియమం ఉంటుంది కనుక కవి నిర్దేశించిన భావం పూర్తిగా పద్యంలో చెప్పగలిగినా లేకపోయినా తప్పనిసరిగా పాదంలో మకుటం చేర్చాలి.

4. శతకానికి ముక్తక లక్షణం ప్రధానం కాని కథలో కొనసాగింపు ఉండాలి కనుక కథాత్మక శతకంలో ముక్తక లక్షణం పూర్తిగా కుదరదు. అయితే ఇక్కడ కూడా ముక్తక లక్షణాన్ని, కథలోని ఒక ఘట్టం మొత్తం ఒక పద్యంలో కుదురుకునేలా, ఆ ఘట్టానికి కొనసాగింపు ఉండని విధంగా, సాధించారు కథాత్మక శతక కవులు. కనుక కవి ఒక ఘట్టాన్ని, అది ఎంత పెద్దది అయినా సరే, ఒకే పద్యంలో,

మకుట సహితంగా చెప్పగలగాలి. అందుకే ఈ శతకంలో నాలుగు పాదాలతో పద్యాన్ని గమ్యం చేర్చలేక 13 పంచపాదులను వ్రాయాల్సి వచ్చింది వేంకటకవికి.

ఉదాహరణకు మారుతి శతకంలో సీతను వెతుకుతూ రాముడు అడవిలో తిరుగుతుండగా హనుమ సుగ్రీవుని పనుపున భిక్షుకుని వేషంలో రాముని వద్దకు వెళ్ళి, సుగ్రీవుని కథను రామునికి తెలిపి, రాముని తెచ్చి సుగ్రీవునితో మైత్రి కల్పించిన ఘట్టాన్ని ఒక పద్యంలో కూర్చే ప్రయత్నంలో చతుష్పాది కాస్తా పంచపాది అవ్వవలసి వచ్చింది.

తనపత్నిం దిలకింపుచున్ నిబిడకాంతారోర్వి వర్తించు రా
మ నరేంద్రోత్తము పాలి కర్కజుఁడు పంపం భిక్షువేషంబునన్
జని, సుగ్రీవుని చందముం దెలిపి యా క్ష్మానాథు దోడ్తెచ్చి, మె
ల్లన నయ్యిద్దఱకుం ధనంజయుని మ్రోలన్ సఖ్యసంబంధమున్
వినయం బొప్పఁ ఘటింపఁ జేసినది నీవే కాదొకో మారుతీ! (8)

కవి కావ్యరచన చేసేటప్పుడు మెల్లగా సన్నివేశానికి కావలసిన నేపథ్యాన్ని సమకూర్చి, తను అనుకున్న ఛందస్సులో, తను అనుకున్న రీతిలో రసావిష్కారం కావిస్తాడు. కాని శతకంలో అటువంటి అవకాశం ఉండదు. కథ చెప్పడానికే పూర్తిగా ఆస్కారం లేని పరిస్థితుల్లో, వర్ణనలకు అస్కారముండే అవకాశమే లేదు. ఇన్ని నియమాలతో శతకాన్ని నిర్వహించడం కత్తి మీద సాము వంటిదే. ఇందువలనే ఈ కథాత్మక శతకం ప్రక్రియా పరంగా విస్తృతిని సాధించలేకపోయింది. అయితే తెలుగులో కథ కవిత్వంనుండి విడివడి స్వతంత్రంగా నిలబడే క్రమంలో కథాత్మక శతక ప్రక్రియ ఒక సంధి దశ వంటిదని చెప్పుకోవాలి.

## ఉపయుక్తగ్రంథసూచి


1. గోపాలకృష్ణరావు, కె. 1976. శతక సాహిత్య వికాసము. హైదరాబాదు: ఆంధ్ర సారస్వత పరిషత్తు.
2. .................. 1975. ఆంధ్ర శతక వాఙ్మయము. హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి.
3. చంద్రమౌళిశాస్త్రి, బెల్లంకొండ. 1962. నవోదయము. విజయవాడ: ఉదయశంకర్ పబ్లిషర్స్.
4. నారాయణరావు, కె.వి. 1936. ఆంధ్ర వాఙ్మయ చరిత్ర సంగ్రహం. మద్రాసు: వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్.
5. మీనన్, కె.కె. 1988. రజత రంజని. హైదరాబాదు: రంజని రజతోత్సవ సంఘం.
6. రామానుజరావు, దేవులపల్లి, పి.ఎస్.ఆర్.అప్పారావు, జి.వి.సుబ్రహ్మణ్యం, ఇరివెంటి కృష్ణమూర్తి. 1983. తెలుగులో పరిశోధన: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి.
7. వేంకటకవి, గోపినాథ. 1994. మారుతి శతకము. హైదరాబాదు: గోపినాథ వేంకటకవి సాహిత్యనికేతన ధర్మనిధి.
8. వేంకటావధాని, దివాకర్ల. 1961. ఆంధ్రవాఙ్మయ చరిత్రము. హైదరాబాదు: శివాజి ప్రెస్
9. సత్యనారాయణరావు, యండమూరి. 1960. ఉషఃకిరణాలు – 19వ శతాబ్ది తెనుగు సాహిత్యచరిత్ర. విజయవాడ: ఉత్తమసాహితి.
10. సీతారామయ్య, కురుగంటి. 1994. నవ్యాంధ్ర సాహిత్య వీధులు. హైదరాబాదు: తెలుగు విశ్వవిద్యాలయం.
11. సుబ్రహ్మణ్యం, జి.వి. 1991. సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు. హైదరాబాదు: తెలుగు అకాడమి.
12. సంపత్కుమారాచార్య, కోవెల. 2011. తెలుగు ఛందస్సులో వెలుగులు. హైదరాబాదు: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

**Thesis:**

1. జయశ్రీ, వాడేపల్లి. 1997. గోపీనాథం వేంకట కవి జీవిత పరిశీలన – సమగ్ర సాహిత్యానుశీలన. హైదరాబాదు విశ్వవిద్యాలయానికి సమర్పించిన పిహెచ్.డి. సిద్ధాంత గ్రంథం.

**WWW:**

1. http://www.kadapa.info/%E0%B0%95%E0%B0%A5%E0%B0%BE%E0%B0%A8%E0%B0%BF%E0%B0%95%E0%B0%BE/ - కథానికా దాని శిల్పమూ – రాచమల్లు రామచంద్రారెడ్డి (డిసెంబరు 1, 2014)